# సాక్షి
## భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 28 । సెప్టెంబర్ । 2023







### శోభాయాత్రకు ఏర్పాట్లు

గణపతి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించిన భక్తులు నేడు వినాయక శోభాయాత్రలకు ఏర్పాట్లు చేస్తున్నారు. 8లో




### హామీలు అమలు చేయాలి

భద్రాద్రి రామయ్యకు రూ.100 కోట్లు, వరద బాధితులకు రూ.1000 కోట్లు విడుదల చేయాలని సీపీఎం నేత పి.సుదర్శన్ అన్నారు. 8లో


గరిష్టం / కనిష్టం
33° / 24°

### వాతావరణం

జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి వేళ ఒకటి, రెండు చోట్ల చిరుజల్లులు పడే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### కమనీయం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

### తరగతి గదుల్లో సెల్‌ఫోన్లు వాడొద్దు

డీఐఈఓ సులోచనారాణి



ఇల్లెందులో రికార్డులు తనిఖీ చేస్తున్న సులోచనారాణి

ఇల్లెందు/టేకులపల్లి : జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని, తరగతి గదుల్లో అధ్యాపకులు సెల్‌ఫోన్లు వినియోగించవద్దని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి బి. సులోచనారాని అన్నారు. బుధవారం ఆమె ఇల్లెందు, టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలను తనిఖీ చేశారు. రెండో యూనిట్ టెస్ట్ ప్రశ్నాపత్రాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థుల్లో చదువుపై పట్టుదల పెరిగేలా బోధన సాగించాలని కోరారు. ల్యాబ్‌లలో పూర్తిస్థాయి ప్రాక్టికల్స్ నిర్వహించాలని సైన్స్ లెక్చరర్లకు సూచించారు. పాఠ్యపుస్తకాలతో పాటు మారుతున్న సమకాలీన అంశాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు కూడా క్రమశిక్షణ అలవర్చుకుని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. సమావేశంలో ప్రిన్సిపాళ్లు రామలింగేశ్వర రావు, ఎస్.కల్పన, అధ్యాపకులు పాల్గొన్నారు.

### ఆయిల్‌పామ్ సాగుపై విదేశీ సంస్థ పరిశోధన



వివరాలు తెలుసుకుంటున్న విదేశీ ప్రతినిధులు

అశ్వారావుపేట: ఆయిల్‌పామ్ సాగు, నూనె ఉత్పత్తి, వ్యాపార అవకాశాలపై ఓ విదేశీ సంస్థ ప్రతినిధులు బుధవారం అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో అధ్యయనం చేశారు. ఆయిల్‌ఫెడ్ డివిజనల్ మేనేజర్ ఆకుల బాలకృష్ణ, సిబ్బందితో సమావేశమైన వారు నర్సరీల్లో మొక్కల పెంపకం, నిర్వహణ, సాగు, గెలల క్రషింగ్, ఆపై క్రూడ్ పామాయిల్ మార్కెటింగ్ వివరాలు తెలుసుకున్నారు. అంతేకాక ఆయిల్ పామ్ తోటల్లో అంతర పంటల సాగుకు ఉన్న అవకాశాలపై చర్చించారు. ఇప్పటి వరకు దేశంలోని పలు రాష్ట్రాల ప్రభుత్వ అధికారులు, శాస్త్రవేత్తలు పరిశోధన కోసం ఇక్కడకు వచ్చేవారు. తొలిసారి బుధవారం విదేశీ సంస్థ ప్రతినిధులు రావడంతో దేశంలో ఆయిల్‌పామ్ అధ్యయన కేంద్రంగా ఉన్న అశ్వారావుపేట ప్రపంచానికి పాఠాలు చెబుతున్నట్లయింది.

### హరిత హోటల్‌కు ఉత్తమ అవార్డు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని హరిత హోటల్‌కు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డు లభించింది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఈ అవార్డును హోటల్ నిర్వాహకులకు అందజేశారు.

### పంటల నమోదు సక్రమంగా చేపట్టాలి

అశ్వారావుపేటరూరల్: పంటల నమోదు కార్యక్రమాన్ని సక్రమంగా చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి కె.అభిమన్యుడు అన్నారు. స్థానిక రైతు వేదికలో బుధవారం సిబ్బందితో మాట్లాడారు. రైతులు సాగు చేస్తున్న అన్ని పంటలను నమోదు చేయాలని, సమగ్ర వివరాలు పొందుపర్చాలని సూచించారు. అనంతరం ఊట్లపల్లి, కేశప్పగూడెం, అశ్వారావుపేటలో వరి, పత్తి పంటలను పరిశీలించారు. ఏవో నవీన్, ఏఈవోలు షాకిరా భాను, రాయుడు పాల్గొన్నారు.

# సర్కారు స్థలంపై 'గులాబీ' కన్ను

**రూ.1.50 కోట్ల విలువైన భూమిని కాజేసేందుకు యత్నం**

- జీవో 76కు ప్రజాప్రతినిధుల వక్రభాష్యాలు
- అక్రమార్కులకు అండగా ఇంటి నంబర్ల జారీ
- కబ్జా పర్వంపై ఓ వర్గం కేడర్ ఆగ్రహం
- పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధం



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కంచే చేను మేస్తే కాపాడేవారెవరు అనే పరిస్థితులు కొత్తగూడెంలో నెలకొన్నాయి. సింగరేణి నుంచి ప్రభుత్వానికి బదలాయించిన స్థలాలపై అధికార పార్టీ నేతల కన్ను పడడంతో వాటికి రక్షణ కరువైపోతోంది. ఆ స్థలాలను కాపాడి, ప్రజోపకర కార్యక్రమాలకు వినియోగించాల్సిన ప్రజాప్రతినిధులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు.

**వనమా కృషితో జీఓ 76..**

సింగరేణి సంస్థ కొత్తగూడెంలో 100 ఏళ్ల క్రితం నుంచే బొగ్గు వెలికి తీస్తోంది. ఈ క్రమంలో వందల ఎకరాల భూమిని గతంలో ప్రభుత్వం నుంచి లీజుకు తీసుకుంది. బొగ్గు తీసిన తర్వాత, బొగ్గు తవ్వకాలకు అనువుగా లేని స్థలాలను తిరిగి రెవెన్యూ శాఖకు అప్పగించింది. ఈ క్రమంలో సింగరేణి స్థలాల్లో చాలా మంది అప్పటికే నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే వారికి తాము నివసించే ఇళ్లు, స్థలాలపై హక్కులు లేకుండా పోయాయి. ఈ ఇబ్బందిని తొలగించాలని స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పలుమార్లు సీఎం కేసీఆర్‌తో మాట్లాడారు. వనమా చేసిన నిర్విరామ కృషితో ప్రభుత్వం జీఓ 76ను జారీ చేసింది. దీని ప్రకారం ఒక్క కొత్తగూడెం ఏరియాలోనే కాకుండా ఇల్లెందు, మణుగూరులో సైతం సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి యాజమాన్య హక్కులు దక్కుతున్నాయి. ప్రభుత్వం సదుద్దేశంతో తీసుకొచ్చిన జీవోను సక్రమంగా అమలు చేయించాల్సిన ప్రజాప్రతినిధులు అందుకు విరుద్ధమైన మార్గాన్ని ఎంచుకున్నారు.

**రూ. కోటిన్నర విలువైన స్థలంపై కన్ను**

కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయానికి సమీపంలో బర్మా క్యాంపు దగ్గర ఉన్న ఓ పాత ఇంటి పక్కన రూ.1.50 కోట్ల విలువైన స్థలం ఉంది. చాలా ఏళ్ల పాటు సింగరేణి ఆధీనంలో ఉన్న ఈ స్థలం కొన్నేళ్ల క్రితం రెవెన్యూ పరిధిలోకి వెళ్లింది. ఈ స్థలంపై కన్నేసిన ఓ అధికార పార్టీ కౌన్సిలర్ తన బినామీతో పాత ఇంటిని కొనుగోలు చేయించాడు. ఆ ఇంటి నంబర్‌పై బై నంబర్లతో మరికొన్ని ఇళ్లు ఉన్నట్టుగా మున్సిపాలిటీలో దరఖాస్తులు చేయించాడు. అక్కడ తన పలుకుబడి ఉపయోగించి వాటికి నంబర్లు సాధించాడు. ఇక ఈ స్థలం, అక్కడున్న ఇల్లు తమదే అంటూ జీవో 76 ప్రకారం క్రమబద్ధీకరణకు ప్రయత్నాలు చేశాడు. గతేడాదే ఈ తతంగమంతా పూర్తయింది. ఇక పట్టాలు రావడమే తరువాయి అనే క్రమంలో ఊహించని పరిణామం ఎదురైంది.

**వర్గపోరుతో వెలుగులోకి..**

మున్సిపల్ పాలకవర్గంలో కౌన్సిలర్లు గతేడాది రెండు వర్గాలుగా విడిపోయారు. దీంతో సదరు అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ కబ్జా పర్వాన్ని మరో వర్గం వారు బయటకు తెచ్చారు. దీంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. ఆ స్థలంలో చేపట్టిన నిర్మాణాలను కూల్చేశారు. ఇది ప్రభుత్వ స్థలమని ప్రకటించారు. ఏడాది తిరిగే సరికి పాలకవర్గంలో నెలకొన్న అసమ్మతి చల్లారింది. రెవెన్యూ అధికారులు పత్తా లేకుండా పోయారు. సింగరేణి సంస్థ తనకేమీ పట్టనట్టుగా మిన్నకుండిపోయింది. దీంతో పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయనే భావనతో మరోసారి తన కబ్జా నైపుణ్యానికి పదును పెట్టాడు సదరు కౌన్సిలర్. తాను చేయబోయే ఆక్రమణకు అంతా సహకరించాలంటూ పాలకవర్గంలోని కీలక నేతలతో సమావేశం నిర్వహించాడు. ఈ వ్యవహారంలో చూసీ చూడనట్టుగా ఉండాలని పురపాలన చూసే ఓ కీలక అధికారికి వర్తమానం పంపాడు. ఇంకే ఆలస్యం అనుకున్నాడేమో, ప్రభుత్వ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు అవసరమైన సరంజామా తెప్పించాడు.

**ఫిర్యాదుకు సిద్ధమైన కేడర్..**

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల దగ్గర పడ్డాయి. అభ్యర్థులంతా ప్రచారంలో బిజీగా ఉన్నారు. గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు పని చేసుకుంటూ పోతున్నాయి. ఈ సమయంలో ప్రభుత్వ స్థలాలను మున్సిపల్ పాలకవర్గం సభ్యులే కబ్జా చేస్తున్నారంటూ వరుసగా వస్తున్న ఆరోపణలు, ప్రతిపక్షాలు చేస్తున్న ఆందోళనలు ఇబ్బందికరంగా మారాయి. దీంతో పార్టీ ప్రయోజనాలకు విరుద్ధంగా స్వప్రయోజనాలే మిన్నగా వ్యవహరిస్తున్న కొందరు కౌన్సిలర్ల వ్యవహార శైలిని ఎండగట్టేందుకు గులాబీ పార్టీలోని ఓ వర్గం కేడర్ సిద్ధమైంది. ముఖ్యంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న మున్సిపల్ శాఖలో ఇలాంటి చర్యలకు పాల్పడటం సరికాదని వారు అంటున్నారు. దీంతో కళ్లముందు జరుగుతున్న అవినీతి వ్యవహారాన్ని పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.



గణనాథులను లాంచీలో ఎక్కించి నిమజ్జనానికి తీసుకెళుతున్న సిబ్బంది

# వినాయకా.. వీడ్కోలిక..

- వైభవంగా గణనాథుల నిమజ్జనం
- గౌతమీ తీరంలో భక్తుల సందడి



క్రేన్ సాయంతో లాంచీలోకి ఎక్కిస్తున్న దృశ్యం

భద్రాచలంటౌన్: తొమ్మిది రోజుల పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు చేసిన వినాయకుడిని బుధవారం భద్రాచలంలోని గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి శోభాయాత్రగా బయలుదేరి భద్రాచలం చేరుకున్న భక్తులతో గౌతమీ తీరం సందడిగా మారింది. యువత కేరింతలు, మహిళల కోలాటాలతో అంతటా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. 'గణపతి బొప్పా మోరియా' అంటూ భక్తులు విఘ్నేశ్వరుడికి వీడ్కోలు పలికారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. వినాయక మండపాల నిర్వాహకులు గణనాథులను ఆటోలు, ట్రాలీలు, ట్రాక్టర్లు, లారీలపై నిమజ్జనానికి తీసుకురాగా, గోదావరి తీరంలో అధికారులు ఏర్పాటు చేసిన సహాయక సిబ్బంది విగ్రహాలను క్రేన్ ద్వారా లాంచీలోకి ఎక్కించి నది మధ్యలో నిమజ్జనం చేశారు. గజ ఈతగాళ్లు, ఎన్‌డీఆర్‌ఎఫ్ రెస్క్యూ టీంను అందుబాటులో ఉంచారు.

**భారీ బందోబస్తు..**

భద్రాచలం ప్రధాన రహదారులతో పాటు గోదావరి తీరంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏఎస్పీ పరితోష్ పంకజ్ ఆధ్వర్యంలో సీఐ నాగరాజురెడ్డి, ఎస్సైలు మధు ప్రసాద్, పీవీ రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పట్టణంలో మూడు చోట్ల వాహనాలకు పార్కింగ్ స్థలాలను కేటాయించి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

మరికొన్ని ఫొటోలు 9లో

# ప్రకృతి అందాలతో కనువిందు

**అదనపు కలెక్టర్ మధుసూదన్ రాజు**




ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

భద్రాచలంటౌన్: పర్యాటకులకు కనువిందు చేసే ప్రకృతి అందాలు, దేవాలయాలు జిల్లాలో ఎన్నో ఉన్నాయని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ రాజు అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా భద్రాచలం దేవస్థానం వద్ద బుధవారం పర్యాటక శాఖ, డీఆర్డీఓ, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మానవహారం, శ్రమదానం, పారిశుద్ధ్య కార్యక్రమాలు, ఆ తర్వాత రామాలయం నుంచి జూనియర్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విహారయాత్రలతో మానసిక ప్రేరణ పెరగడంతో పాటు చరిత్రపై అవగాహన కలుగుతుందని అన్నారు. జిల్లాలో అద్భుతమైన చారిత్రక సంపద ఉందని, ప్రతి ఒక్కరూ జిల్లా చరిత్ర, సంస్కృతి తెలుసుకోవాలని చెప్పారు. భద్రాచలం, పర్ణశాల, కిన్నెరసాని ప్రాజెక్ట్, జింకల పార్క్, పెద్దమ్మ తల్లి దేవాలయం, నవభారత్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయం, అన్నపురెడ్డిపల్లిలో బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం, శివాలయం, అశ్వారావుపేటలో గుబ్బల మంగమ్మ గుడి వంటి ఎన్నో దర్శనీయ స్థలాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎన్. శ్రీనివాస్‌రావు, డీపీఓ రమాకాంత్, డీసీఓ వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### కాంట్రాక్టు కార్మికులకూ చెల్లించాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): కార్మికుల నిరంతర శ్రమతోనే సింగరేణి సంస్థకు లాభాలు వస్తున్నాయని ఇఫ్టూ జాతీయ అధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వరరావు తెలిపారు. కొత్తగూడెంలోని కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లాభాల్లో 35శాతం వాటా ఇవ్వాలని తాము ఆందోళన చేయడంతో యజమాన్యం 32 శాతం ప్రకటించిందని చెప్పారు. అయితే, లక్ష్యసాధనలో రెగ్యులర్ కార్మికులతో సమానంగా కాంట్రాక్ట్ కార్మికులు శ్రమిస్తున్నా వారికి వాటా ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఇకనైనా యజమాన్యం స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# పులిగుండాలలో 'పర్యాటక' యాత్ర



పులిగుండాలలో పర్యటిస్తున్న విద్యార్థులు

ఖమ్మం స్పోర్ట్స్: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటక శాఖ ఆధ్వర్యాన ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం పులిగుండాల అటవీ ప్రాంతంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం ట్రెక్కింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆతర్వాత అటవీ శాఖ అధికారులు పులిగుండాల ప్రాముఖ్యతను వివరించగా.. అక్కడి వ్యర్థాలను విద్యార్థులు తొలగించారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్‌చక్రవర్తి, తల్లాడ రేంజ్ ఆఫీసర్ అరవింద్, డీఆర్‌ఓ రామారావు, అధ్యాపకులు కృష్ణవేణి, ఎఫ్ఎస్‌ఓ కాలు, బీట్ ఆఫీసర్లు లావణ్య, సరిత పాల్గొన్నారు.

**ఉత్సాహంగా పర్యాటక దినోత్సవం**




లకారం ట్యాంక్ బండ్‌పై వేడుకల్లో నృత్యం చేస్తున్న దృశ్యం

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా బుధవారం ఖమ్మంలోని లకారం ట్యాంక్‌బండ్‌పై వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పర్యాటక శాఖ అధికారి బి.సుమన్‌చక్రవర్తి మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధి చెందుతోందని తెలిపారు. అనంతరం విద్యార్థులు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

# లక్ష్మణ్ బాపూజీని ఆదర్శంగా తీసుకోవాలి

**బీసీ సంక్షేమాధికారి ఇందిర**



లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఇందిర, ఉద్యోగులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని బీసీ సంక్షేమాధికారి బి.ఇందిర అన్నారు. లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. స్వాతంత్రోద్యమంలో, ఆ తర్వాత తెలంగాణ ఉద్యమంలో బాపూజీ చురుకుగా పాల్గొన్నారని అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ రుక్మిణీదేవి, యువజన, క్రీడల అధికారి పరంధామరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి కొర్స అభిమన్యుడు, ఉద్యాన శాఖాధికారి జినుగు మరియన్న, బీసీ సంఘం నాయకులు మాడిశెట్టి శ్రీనివాస్, కొదుమూరి సత్యనారాయణ, ఎం. ధర్మారావు, అముదాల వెంకటనర్సయ్య, కె. కుమార్, చిప్పా శ్రీనివాస్, బండి రాజుగౌడ్ పాల్గొన్నారు.

# ఓటు నమోదుపై అవగాహన



ఈవీఎంపై కొండరెడ్లకు అవగాహన కల్పిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

అశ్వారావుపేటరూరల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంల ద్వారా ఓటు నమోదు చేసుకునే విధానంపై మారుమూల కొండరెడ్ల గ్రామమైన రెడ్డిగూడెంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు బుధవారం అవగాహన కల్పించారు. ఆ తర్వాత అశ్వారావుపేటలోని రైతు వేదిక ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో దివ్యాంగ ఓటర్లకు ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానం గురించి వివరించారు. వారితో డెమోమిషన్ ద్వారా ఓటు నమోదు చేయించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఈ నెల 27వ తేదీ నాటికి వచ్చిన ఓటరు దరఖాస్తుల వివరాలను తెలియజేశారు. ఆయా కార్యక్రమాల్లో స్వీప్ నోడల్ అధికారి త్రినాథ్‌బాబు, నోడల్ అధికారిణి లెనినా, తహసీల్దార్ వి.కృష్ణ ప్రసాద్, ఎన్నికల డీటీ వీరభద్ర నాయక్, సిబ్బంది ప్రభాకర్, వి లావణ్య, రెడ్డిగూడెం సర్పంచ్ యాట్ల మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గులాబీ జెండా ఎగరడం ఖాయం

- హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ నిలుస్తారు
- ఇల్లెందులో హరిప్రియ చరిత్ర తిరగరాస్తారు..
- ఎంపీలు రవిచంద్ర, కవిత ధీమా




సభలో మాట్లాడుతున్న ఎంపీ రవిచంద్ర, పక్కన ఎంపీ కవిత, ఎమ్మెల్యే హరిప్రియ తదితరులు

టేకులపల్లి: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లోనూ గులాబీ జెండానే ఎగురుతుందని, సీఎం కేసీఆర్ మూడోసారి అధికారం సాధించి హ్యాట్రిక్ కొట్టబోతున్నారని రాజ్యసభ సభ్యుడు, ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వద్దిరాజు రవిచంద్ర, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత అన్నారు. టేకులపల్లి మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన బీఆర్‌ఎస్ సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలో కార్యకర్తల జోష్ చూస్తుంటే ఎమ్మెల్యే హరిప్రియ మరోసారి విజయం సాధించడం ఖాయంగా కనిపిస్తోందని, అయితే మెజార్టీ పెంచేందుకే ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. ఇల్లెందు నియోజకవర్గంలో గత 50 ఏళ్లలో జరగని అభివృద్ధి, ఈ ఐదేళ్లలోనే చేయడం అభినందనీయమని అన్నారు. అన్ని సర్వేలు హరిప్రియకు అనుకూలంగా వచ్చాయని తెలిపారు. టేకులపల్లి మండలంలో 38 వేల వరకు ఓట్లు ఉన్నాయని, అందులో 35వేలు పోలైనా కారు గుర్తుకు 30 వేల ఓట్లు పడేలా కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో హనుమాన్ గుడి లేని ఊరు లేదు, కేసీఆర్ సంక్షేమ పథకం అందని ఇల్లు లేదని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ ఇల్లెందు నియోజకవర్గానికే రూ.1,860 కోట్లు విడుదల చేశారని, హరిప్రియ నిబద్ధతతో పనిచేయడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. ఇప్పటివరకు ఇల్లెందులో గెలిచిన పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాలేదని, ఈసారి ఎన్నికల్లో హరిప్రియ ఆ చరిత్రను తిరగరాస్తారని ధీమా వ్యక్తం చేశారు. బోడు, కొమరారం మండలాల ఏర్పాటుకు అంతా కలిసి సీఎంను ఒప్పిస్తామని హామీ ఇచ్చారు. కేసీఆర్‌ని కాదని పార్టీని వీడి వెళ్లిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోరం కనకయ్య ప్రజల నుంచి దూరమయ్యారని విమర్శించారు. కోరం కనకయ్య జెడ్పీ చైర్మన్ పదవికి ఎందుకు రాజీనామా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఇల్లెందులో కాంగ్రెస్ టికెట్ కోసం 37 మంది దరఖాస్తు చేసుకున్నారని, అందులో ఒకరికి టికెట్ వస్తే మిగిలిన 36 మంది హరిప్రియ గెలుపు కోసమే పని చేస్తారని జోస్యం చెప్పారు. ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన మాట కోసం కేసీఆర్‌తో కొట్లాడి కోట్లాది రూపాయల నిధుల తీసుకొచ్చి అభివృద్ధి చేశానని చెప్పారు. మీ ఆడ బిడ్డగా మరోసారి ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించాలని కోరారు. ఇంకా రూ.150 కోట్ల విలువైన అభివృద్ధి పనులను త్వరలోనే మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించుకుంటామని చెప్పారు. అనంతరం మండలంలో రూ.13.87 కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ దిండిగల రాజేందర్, నాయకులు బొమ్మెర్ల వరప్రసాద్, బోడ బాలు, దళపతి శ్రీనివాస్‌రాజు, బానోత్ రామ, కిషన్, కంభంపాటి చంద్రశేఖర్, శ్యామ్, చీమల సత్యనారాయణ, తేజావత్ రవి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు అంగన్‌వాడీలు, నేషనల్ హైవే బాధితులు ఎంపీలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఎంపీ కవిత హరిప్రియ ఫౌండేషన్ ఉచిత వైద్యశాలను సందర్శించారు.



శంభునిగూడెంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీలు, ఎమ్మెల్యే

## క్లుప్తంగా

### డిగ్రీ కళాశాలకు గ్రీన్ ఆడిట్ సర్టిఫికెట్

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 2022 – 23 విద్యా సంవత్సరానికి గాను అత్యుత్తమ ఏ ప్లస్ గ్రీన్ ఆడిట్ సర్టిఫికెట్ లభించినట్లు ప్రిన్సిపాల్ భద్రయ్య తెలిపారు. కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షించడంలో కళాశాల నిబద్ధతను ప్రదర్శించిందని, ఈ ప్రాంత విద్యా సంస్థలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని అన్నారు. ఇంధన సంరక్షణ, వ్యర్థాల తగ్గింపు, జీవ వైవిధ్యం వంటి పర్యావరణ పద్ధతుల అమలుతో పాటు కార్బన్ పాదముద్రను తగ్గించడంలో స్కోర్ సాధించడంతో ఈ సర్టిఫికెట్ దక్కిందని వివరించారు.

### కిశోరామృతం ప్యాకెట్లు పంపిణీ



కిశోరామృతం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సీడీపీఓ, ఎంపీటీసీ

చుంచుపల్లి: మండల పరిధిలో బాబు క్యాంప్ గ్రామపంచాయతీ అంగన్‌వాడీ సెంటర్‌లో 14–17 ఏళ్ల కిశోర బాలికలకు సమృద్ధి పోషకాలతో కూడిన కిశోరామృతం ప్యాకెట్లను బుధవారం సీడీపీఓ స్వర్ణలత లెనినా, బాబు క్యాంప్ ఎంపీటీసీ కూసన వీరభద్రం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికల ఆరోగ్యం కోసం ప్రభుత్వం వీటిని పంపిణీ చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ భవాని , అంగన్‌వాడీ టీచర్స్ జమున, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

### మణుగూరు సీఐగా రమాకాంత్



సీఐ రమాకాంత్

మణుగూరు టౌన్: మహబూబాద్‌లో జిల్లా స్పెషల్ బ్రాంచిలో పనిచేస్తున్న సీఐ ఏ.రమాకాంత్‌ను మణుగూరుకు బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ బాలాజీ వరప్రసాద్‌ను రమాకాంత్ స్థానంలోకి బదిలీ చేస్తూ బుధవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు విడుదల చేశారు. ఇటీవల మణుగూరు సీఐగా వచ్చిన బాలాజీ వరప్రసాద్ ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు చేరువయ్యారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అతి తక్కువ కాలంలోనే మళ్లీ బదిలీపై వెళ్లడం పట్ల రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

### దాడి ఘటనలో కేసు నమోదు

దమ్మపేట: దాడి ఘటనలో బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మంగళవారం రాత్రి సమయంలో మందలపల్లి గ్రామంలోని ప్రకాష్‌నగర్ కాలనీకి చెందిన షేక్ జాన్‌పాషా ఇంట్లోకి సాయిల నరసింహారావు, ఆకుల కృష్ణారావు, ఆళ్ల పండు, పానుగంటి లోకేష్, ఈశ్వరప్రగడ భూషణం, కోలికపోగు వెంకటేశ్వరరావు అక్రమంగా ప్రవేశించారు. ఆ సమయంలో జాన్‌పాషా, కుటుంబ సభ్యులు భోజనం చేస్తున్నారు. ఈ క్రమంలో జాన్ పాషా భార్య అస్మా పట్ల ఆరుగురు వ్యక్తులు అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు పాషాపై భౌతిక దాడికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

### పూరి గుడిసెలు దగ్ధం



మంటల్లో దగ్ధమవుతున్న గుడిసెలు

భద్రాచలంఅర్బన్: పట్టణంలో బుధవారం గణేష్ శోభాయాత్ర నిర్వహిస్తున్న సమయంలో బాణసంచా కాల్చారు. దీంతో పాత మార్కెట్ సమీపంలోని జీసీసీ దుకాణం పక్కన ఉన్న పూరి గుడిసెలపై నిప్పు రవ్వలు పడి మంటలు అంటుకున్నాయి. స్థానికుల సమాచారంతో ఫైరింజన్‌తో వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. కాగా ఈ ఘటన జరిగిన సమయంలో ఆ ప్రదేశంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

### రూ.78లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్: ఖమ్మం రోటరీనగర్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గోరంట్ల విద్యాసాగర్ రూ.78.10 లక్షలకు గాను దివాలా పిటిషన్ (ఐపీ) దాఖలు చేశాడు. ఆయన రియల్ ఎస్టేట్ వ్యాపారంలో భాగంగా బంధువులు, స్నేహితుల వద్ద అధిక వడ్డీకి అప్పులు చేశారు. అయితే, అప్పులు తీర్చే పరిస్థితి ఎదురైందని చెబుతూ 14 మందిని ప్రతివాదులుగా చేర్చి ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాది ద్వారా బుధవారం ఐపీ దాఖలు చేశాడు.

### పామాయిల్ గెలలు



| | |
|---|---|
| టన్ను ధర | రూ.13,026 |

# నేడు 'గణ' వీడ్కోలు..



**శోభాయాత్రకు అంతా సిద్ధం**

- భద్రాచలంతోపాటు పలుచోట్ల ఏర్పాట్లు చేసిన అధికారులు
- జిల్లా వ్యాప్తంగా గోదావరికి తరలనున్న 1,500కి పైగా విగ్రహాలు
- ట్రాఫిక్ నియమాలు పాటించాలని పోలీస్ శాఖ సూచనలు



రద్దీ నియంత్రణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసులు, ఉత్సవ కమిటీ బాధ్యులు

కొత్తగూడెంటౌన్: తొమ్మిది రోజులపాటు భక్తుల పూజలందుకున్న గణనాథుడు గురువారం గంగ ఒడికి చేరనున్నాడు. జిల్లా కేంద్రంతోపాటు పాల్వంచ, ఇల్లెందు, భద్రాచలం, మణుగూరు, అశ్వారావుపేట తదితర ప్రాంతాల్లో నిర్వాహకులు శోభాయాత్రకు అంతా సిద్ధం చేశారు. వినాయక నవరాత్రి మహోత్సవాలు గురువారంతో ముగియనుండగా, కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో శోభాయాత్ర అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 1500కి పైగా గణేష్ ప్రతిమలు నిమజ్జనానికి భద్రాచలం తరలివెళ్లనున్నాయని పోలీ స్ అధికార వర్గాలతోపాటు గణేష్ ఉత్సవ కమిటీలు పేర్కొటున్నాయి. ఈ నెల 18న ప్రారంభమైన వినా యక చవితి వేడుకలు 28న నిమజ్జనంతో ముగియనున్నాయి. శోభాయాత్ర వాహనాలు వెళ్లే మార్గం, భద్రాచలం కరకట్ట వద్ద పాటించాల్సిన జాగ్రత్తలపై ఇప్పటికే మండపాల నిర్వాహకులకు దిశా నిర్దేశం చేశామని ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ట్రాఫిక్ పోలీసులతోపాటు ఇతర పోలీస్ విభాగాలతో భారీగా బందోబస్తు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐలు, ఎస్‌ఐల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. నేడు ప్ర కాశం స్టేడియంలో కొత్తగూడెం గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్, ఇతర సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న గణేష్ శోభాయాత్రను ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ప్రారంభించనున్నారు.

**భారీ బందోబస్తు..**

శోభాయాత్ర నేపథ్యంలో గురువారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి వరకు వినాయక విగ్రహాల ఊరేగింపు జరగనుంది. దీంతో పోలీస్ భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు. కొత్తగూడెం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వినాయక విగ్రహాలు చంద్రుగొండ, రుద్రంపూర్, గౌతంపూర్, త్రీఇంక్లైన్, పెనగడప, రామవరం, హెడ్ ఆఫీస్ ఏరియా, పాత కొత్తగూడెం, సుజాతనగర్, జూలూరుపాడు, విద్యానగర్ కాలనీ తది తర ప్రాంతాల నుంచి నిమజ్జనానికి ఊరేగింపుగా వచ్చే వాహనాలు మొదటగా సింగరేణి ప్రకాశం స్టేడియానికి చేరుకుంటాయి. అక్కడి నుంచి ఊరేగింపుగా సూపర్‌బజార్‌లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి సభావేదిక వద్దకు వస్తాయి. జిల్లా కేంద్రం నుంచి పాల కేంద్రం, పాల్వంచ మీదుగా ఊరేగింపు వాహనాలు భద్రాచలం చేరకోనున్నాయి. ఇల్లెందు నుంచి వచ్చే వాహనాలు కొత్తగూడెం–ఇల్లెందు క్రాస్ రోడ్డు, పాల్వంచ మీదుగా భద్రాచలం తరలివెళ్లనున్నాయి.

**వేదిక ఏర్పాటుకు ప్రత్యేక పూజలు**

కొత్తగూడెం రైల్వే స్టేషన్ సమీపంలో గణేష్ ఉత్సవ వేదిక ఏర్పాటుకు బుధవారం గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ గౌరవ అధ్యక్షుడు కంచర్ల చంద్రశేఖరరావు, ఉపాధ్యక్షుడు వందనపు శ్రీధర్, లక్ష్మణ్, దారా రమేష్, జల్లారపు శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం నిర్వహించాలని కలెక్టర్ ప్రియాంక ఆల బుధవారం ఒక ప్రకటనలో కోరారు. తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో గణనాథునికి పూజలు చేశారని, అదే అంకిత భావంతో నిమజ్జనం చేయాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బారికేడ్లు దాటి భక్తులు రావద్దని పేర్కొన్నారు.

### భక్తులు సహకరించాలి



భద్రాచలంలో నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. అక్కడి అధికారుల సలహాలు, సూచనలతో గణేషుడి విగ్రహాలను నిమజ్జనం చేయాలి. నిర్వాహకులకు రూట్ మ్యాప్‌లపై అవగాహన కల్పించాం. శోభాయాత్రను ప్రశాంతంగా జరుపుకోవాలి. ట్రాఫిక్ నియమాలు పాటించాలి. డ్రైవర్లు మద్యం మత్తులో వాహనాలు నడపకుండా నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి. ఒక డీజేలకు అనుమతులు లేవు. భక్తులు పోలీసులకు సహకరించడంతోపాటు ఏవైనా ఇబ్బందులు ఉంటే పోలీసుల సహకారం తీసుకోవాలి. –డాక్టర్ వినీత్, ఎస్పీ

### పోలీసుల సలహాలు పాటించాలి..



వినాయకుడిని భక్తిశ్రద్ధలతో 9 రోజులపాటు పూజించాం. గురువారం జరుపుకోనున్న నిమజ్జన కార్యక్రమాన్ని భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి. శోభాయాత్రలో భక్తులు పోలీసులు, గణేష్ ఉత్సవ కమిటీల సూచనలు, సలహాలు పాటించాలి.

– కేవీ రంగాకిరణ్, కొత్తగూడెం గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు

# హామీలు అమలు చేయాలి

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్**



మాట్లాడుతున్న సుదర్శన్

భద్రాచలంఅర్బన్/చర్ల: రాముడికి ఇస్తానన్న రూ.100 కోట్లు, వరద బాధితులకు రూ.1000 కోట్లు, ప్రగళ్లపల్లి, వద్దిపేట చెక్ డ్యాంలకు నిధులు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ డిమాండ్ చేశారు. సీపీఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30న కేటీఆర్ భద్రాచలం వస్తున్నారని, సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంపై ఆయన సమాధానం చెప్పాలని కోరారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో కరకట్టలు కట్టాలని, వరద బాధితులకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు కట్టించి ఇవ్వాలని కోరారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వడం లేదని, వలస ఆదివాసీల పట్ల ఎందుకు వివక్ష చూపుతున్నారని ప్రశ్నించారు.

**వైద్యులు, సిబ్బందిని నియమించాలి**

చర్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యులు, సిబ్బందిని నియమించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో చర్లలోని బస్టాండ్ సెంటర్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించి మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, నాయకులు యలమించిలి రవి కుమార్, మచ్చా వెంకటేశ్వర్లు, కారం పుల్లారావు, కారం నరేష్, గద్దం స్వామి, బాలనర్సారెడ్డి, శరత్, మర్లపాటి రేణుక, సత్య, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంక్‌లో మహిళల నిరసన



బ్యాంక్‌లో బైఠాయించిన మహిళలు

ములకలపల్లి: వన్‌టైం సెటిల్‌మెంట్ పేరిట రూ.2 లక్షల రుణం చెల్లించినా, ఇంకా నగదు చెల్లించాలని బ్యాంకు సిబ్బంది ఒత్తిడి చేస్తున్నారని ఆరోపిస్తూ బుధవారం మహిళలు బ్యాంక్‌లోనే బైఠాయించి నిరసన తెలిపారు. పూసుగూడెం గ్రామం గులాబీ డ్వాక్రా గ్రూపు సభ్యుల రుణ చెల్లింపులు నిలిచిపోగా, అధికారుల సూచన మేరకు సుమారు 2 నెలల క్రితం వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రూ.2 లక్షలు చెల్లించారు. దీంతో తమ అప్పు తీరినా, బ్యాంకు సిబ్బంది తమపై ఇంకా డబ్బులు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారని, ఈ విషయం మాట్లాడేందుకు బ్యాంక్‌కు రాగా ఫీల్డ్‌ఆఫీసర్ శ్రీను తమపట్ల దురుసుగా ప్రవర్తించాడని మహిళలు ఆరోపించారు. బ్యాంక్ అకౌంట్ బుక్ ముఖంపై విసిరేశారని, మీలో ఎవరైనా చనిపోతే ఇన్సూరెన్స్ డబ్బులైనా జమ చేసుకుంటామని నిర్లక్ష్యంగా మాట్లాడారని వాపోయారు. ఈవిషయమై బ్యాంక్ మేనేజర్ భరత్ క్రాంతిని వివరణ కోరగా.. గ్రూపునకు రూ.6 లక్షలు బకాయి ఉండగా, వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రూ.3 లక్షల చెల్లించాలని తెలుపగా, రూ 2 లక్షలు మాత్రమే జమ చేశారని పేర్కొన్నారు. ఇంకా రూ.లక్ష చెల్లించాల్సి ఉందని, తాము ఎవరినీ దూషించలేదని, అలా మట్లాడామని భావిస్తే క్షమాపణ చెబుతున్నామని వివరించారు.

### కారు ఢీకొని ఐదుగురికి గాయాలు

పాల్వంచ: కారు ఢీకొని ఐదుగురికి గాయాలైన సంఘటన పట్టణంలోని కరకవాగు వద్ద బుధవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. బుధవారం రాత్రి కిన్నెరసాని వైపు నుంచి మద్యం మత్తులో ఓ వ్యక్తి కారులో వస్తున్నాడు. అదే సమయంలో పట్టణ పరిధిలోని కరకవాగు గ్రామం వద్ద గణేష్ నిమజ్జనానికి ఊరేగింపు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కారు దూసుకెళ్లడంతో ఊరేగింపులో వస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. కారుపై కొందరు దాడి చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### చెట్టుకు బైక్ ఢీకొని వ్యక్తి మృతి

పినపాక : మండలంలోని గోపాల్‌రావుపేటకు చెందిన బూరుగడ్డ రాములు(50) సీతంపేట శివారులో బైక్‌ను చెట్టుకు ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్‌లో ఇస్త్రీ షాప్ నిర్వహిస్తున్న రాములు బుధవారం రాత్రి పని ముగించుకుని ఇంటికి తిరిగివెళుతున్న క్రమంలో సీతంపేట వద్ద బైక్‌ను చెట్టుకు ఢీకొట్టాడు. స్థానికులు గమనించి పినపాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు.

### మాజీ ఎమ్మెల్సీ 'పోట్ల'కు అస్వస్థత

కొత్తగూడెంరూరల్: టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు బుధవారం అనారోగ్యానికి గురై హైదరబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన గాంధీ భవన్‌కు వెళ్లి వస్తుండగా, బీపీ పెరగడంతో వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. దీనిపై పార్టీ వర్గాలు ఎలాంటి ప్రకటన చేయలేదు.

# వైఫల్యాలే విజయానికి సోపానాలు

- సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి
- మైనార్టీ గురుకులంలో ముగిసిన క్రీడాపోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ తిరుపతిరెడ్డి

కారేపల్లి: జీవితంలో ఎదురయ్యే వైఫల్యాలను భవిష్యత్ విజయాలకు సోపానాలుగా మలుచుకోవాలే తప్ప కుంగిపోవద్దని సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి సూచించారు. కారేపల్లిలోని మైనార్టీ బాలికల గురుకుల విద్యాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లాస్థాయి బాలికల అండర్-14, అండర్-17 క్రీడాపోటీలు బుధవారం ముగిశాయి. ఈపోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా ఖమ్మం గరల్స్–1 పాఠశాల జట్టు నిలిచింది. ఈ సందర్భంగా విజేతలకు సీఐ తిరుపతిరెడ్డి, కారేపల్లి ఎస్‌ఐ పుష్పాల రామారావు బహుమతులు అందజేసి మాట్లాడారు. తొలుత అతిథులకు విద్యార్థినులు గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు అరుణ కుమారి, ఎం.శైలజ, సీతామహాలక్ష్మి, గీతాజ్యోతి, హిమబిందు, నమిబి, అబీదాసల్మా, రమేష్, వైస్ ప్రిన్సిపాల్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

### స్కూటీని ఢీకొట్టిన కారు

**పంచాయతీ కార్యదర్శికి తీవ్రగాయాలు**



చికిత్స పొందుతున్న కార్యదర్శి షర్మిల

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామపంచాయతీ కార్యదర్శి షర్మిల తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం .. కార్యదర్శి స్కూటీపై కార్యాలయానికి వెళ్తున్న క్రమంలో వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ద్విచక్రవాహనాన్ని సుమారు 50 మీటర్ల దూరం వరకు ఈడ్చుకెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ షర్మిల రోడ్డు పక్కనే అపస్మారక స్థితిలో పడిపోగా, పంచాయతీ సిబ్బంది ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా కారు అతివేగంతోనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తుండగా, షర్మిల హెల్మెట్ ధరించడం వల్లే ప్రాణాపాయం నుంచి బయటపడిందని స్థానికులు చెబుతున్నారు.

### యువతి అదృశ్యం

ఇల్లెందు: మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యంకాగా బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఖమ్మంలోని ప్రియదర్శిని కళాశాలలో డిగ్రీ చదువుతున్న ఆమె నెల రోజుల నుంచి ఆరోగ్యం బాగుండటం లేదని ఇంటి వద్దే ఉంటోంది. ఈ నెల 26న రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవటంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికిన ఆచూకీ లేదు. దీంతో యువతి తండ్రి దొంతు కోటయ్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రవూఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### వృద్ధురాలిపై దాడి

దమ్మపేట: భూ వివాదాలతో వృద్ధురాలిపై దాడికి పాల్పడిన సంఘటన మండల పరిధిలోని మందలపల్లి గ్రామంలో చోటుచేసుకోగా ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం... భూ వివాదాల నేపథ్యంలో ఈ నెల 25న మందలపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు ఒరుగంటి పెద్దింట్లమ్మపై అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు గొనెల పోలయ్య, గొనెల ఫకీర్, గొనెల మారేష్ భౌతిక దాడికి పాల్పడ్డారు. అసభ్య పదజాలంతో దూషించడంతోపాటు ఆమె మనవడు, కోడలుపై కూడా భౌతిక దాడికి ప్రయత్నించారు. ఈ దాడిలో పెద్దింట్లమ్మ తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

### పెరుగుతున్న జ్వర బాధితులు



రోగి బెడ్ మీద కూర్చొని ఉండగా సెలైన్ పట్టుకుని నిలబడిన సహాయకుడు

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలో రోజురోజుకూ జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోంది. వచ్చే బాధితులకు బెడ్లు కూడా సరిపోవడం లేదు. రెండు వార్డుల్లో కేవలం 10 బెడ్లు మాత్రమే ఉండటంతో కొందరు నిలబడే సెలైన్ ఎక్కించుకుంటున్నారు. ఉదయం 11 గంటలు దాటితే ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేయడం లేదు. అప్పటికే ఎక్కువ మంది ఉంటుండంతో మరుసటి రోజు రావాలని చెబుతున్నారు. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ స్పందించి ఆస్పత్రిలో సౌకర్యాలు పెంచాలని తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈసం నర్సింహారావు కోరారు.

### గంజాయి కేసులో ఇద్దరికి 13 ఏళ్ల జైలు శిక్ష

కొత్తగూడెంటౌన్: గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడ్డ కేసులో ఇద్దరు నిందితులకు 13 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ బుధవారం కొత్తగూడెం జిల్లా మొదటి అదనపు జడ్జి ఎం.శ్యాంశ్రీ తీర్పు చెప్పారు. తీర్పు వివరాలు ఇలా.. గతేడాది జూలై 22న వెల్లుల్లి లోడ్‌తో వెళ్తున్న ట్రాలీ వాహనంలో 391 కేజీల గంజాయి తరలిస్తుండగా భద్రాచలంలో ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులు రంగారెడ్డి జిల్లా శవరాంపల్లి మండలం హాసన్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఖాన్, హైదరాబాద్ అమాంనగర్‌కు చెందిన మహ్మద్ ఆంజద్‌లను అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జీషీట్‌ను దాఖలు చేశారు. కేసును పరిశీలించిన జడ్జి నలుగురు సాక్షులను విచారించగా, నేరం రుజువుకావడంతో ఇద్దరి నిందితులకు 13 ఏళ్ల చొప్పున కఠిన కారాగార శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున రావి విజయ్‌కుమార్ వాదించగా, కోర్టు లైజన్ ఆఫీసర్ హరిగోపాల్, ఎక్సైజ్ పీసీ ఏ.నాగేశ్వరరావు సహకరించారు.

### అభివృద్ధి పనులకు నిధులు విడుదల

భద్రాచలంటౌన్: భద్రాచలం నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వం ప్రకటించిన నిధులను విడుదల చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. భద్రాచలం శివారులో 40 మీటర్ల కరకట్ట కొనసాగింపుతో పాటు చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో పలు పనులకు రూ.38.045 కోట్ల నిధులు విడుదల చేసింది. కాగా భద్రాచలంలోని కరకట్ట పనులకు ఈ నెల 30న రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయనున్నారు.

### బైక్ ఢీకొని మహిళ మృతి



జ్యోతి(ఫైల్)

ఇల్లెందు: పట్టణంలోని జగదాంబాసెంటర్‌లో బస్ కోసం వేచి ఉన్న ఓ మహిళ బైక్ ఢీకొని మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన భూక్యా జ్యోతి(51) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఖమ్మం ఆస్పత్రికి వెళ్లేందుకు గ్రామం నుంచి ఇల్లెందు జగదాంబా సెంటర్‌కు వచ్చి బస్సు కోసం ఎదురుచూస్తోంది. అదే సమయంలో లలితా కళామందిర్ ఏరియాకు చెందిన హోంగార్డు బాబు కుమారుడు ప్రవీణ్ బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలుకాగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందిందని తెలిపారు. మృతురాలి కుమారుడు సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

### ప్రైవేట్ ఆస్పత్రిలో మహిళ మృతి

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో దుమ్ముగుడెం మండలం బండిరేవుకు చెందిన 35 ఏళ్ల వయసు మహిళ అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరింది. కొన్ని రోజులుగా చికిత్స పొందుతూ, ఆరోగ్యం క్షీణించి మంగళవారం రాత్రి మృతి చెందింది. డెంగీ జ్వరంతోపాటు ఫిట్స్ కూడా రావడంతో ఆరోగ్యం క్షీణించినట్లు సమాచారం.

### పామాయిల్ పీచు ట్రాక్టర్ బోల్తా



బోల్తా పడ్డ ట్రక్కు

దమ్మపేట: ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడిన సంఘటన మండల కేంద్రంలోని మల్లారం గ్రామానికి వెళ్లే మూలమలుపు వద్ద బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం ...మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ నుంచి పామాయిల్ వ్యర్థ పీచు లోడ్ ట్రాక్టర్ దమ్మపేట వైపునకు వస్తోంది. ఈ క్రమంలో దమ్మపేట నుంచి మల్లారానికి వెళ్లే దారిలోని మూలమలుపు వద్ద పెద్ద గుంతలు ఉండటంతో, ఆ గుంతల్లో పడిన ట్రాక్టర్ ట్రక్కు అదుపు తప్పి బోల్తా పడింది. కాగా ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. ఈ రోడ్డు మార్గం ద్వారానే నిత్యం వందల సంఖ్యలో, ట్రాక్టర్లు, లారీలు లోడ్‌తో పామాయిల్ ఫ్యాక్టరీకి వెళ్తుంటాయి. రద్దీ మార్గంలో, అది కూడా మూలమలుపు వద్ద గుంతలు ఉండటంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గుంతలు పుడ్చాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు, వాహనదారులు, పామాయిల్ రైతులు వాపోతున్నారు.

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

బూర్గంపాడు: బూర్గంపాడు సమీపంలోని కొల్లుచెరువు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. కొల్లుచెరువు వద్ద ఎదురెదురుగా రెండు మోటార్‌సైకిళ్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో గుండాలపాడుకు చెందిన జోగయ్య తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన బూర్గంపాడు నుంచి గుండాలపాడు వెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్ ఢీ కొన్నట్లు స్థానికులు చెబుతున్నారు. మరో మోటార్‌సైకిల్‌పై ఉన్న ఆంజనేయులు, మరో వ్యక్తికి కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను బూర్గంపాడు సివిల్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో జోగయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

### ఇసుక వాహనాలు సీజ్

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ పంచాయతీలోని ముర్రేడు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్, ట్రాలీని అటవీశాఖ అధికారులు బుధవారం సీజ్ చేశారు.